

కవితకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో బీఆర్‌ఎస్ నేత చింతల

## ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 9 : జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బుధవారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 12న తన కుమార్తె మైత్రీరెడ్డి వివాహానికి హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను ప్రభాకర్ రెడ్డి అందించారు. వారి వెంట మాజీ కౌన్సిలర్ కర్ణాటి రవీందర్, రవి, శేఖర్ ఉన్నారు.

## హస్తకళలను ప్రోత్సహించేందుకే గోల్కొండ విక్రయశాల

- రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ శైలజారామయ్యర్



జ్యోతి ప్రజ్వలన చేసి హస్తకళా విక్రయశాలను ప్రారంభిస్తున్న శైలజా రామయ్యర్

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 9 : హస్తకళలను ప్రోత్సహించేందుకే స్వామివారి క్షేత్రంలో గోల్కొండ హస్తకళా విక్రయశాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ శైలజా రామయ్యర్ అన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆలయం కొండపైన రాష్ట్ర హస్తకళా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన గోల్కొండ హస్తకళల విక్రయశాలను అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణతో కలిసి ఆమె ప్రారంభించి మట్లాడారు. భక్తులు హస్తకళా వస్తువులను కొనుగోలు చేసి ఉపాధి కల్పించాలని కోరారు. హస్తకళల అభివృద్ధి సంస్థ ఓఎస్‌డీ భాష, మసూద అలీ, వేణుగోపాల్, గాయత్రి, సుల్తానా, శ్రీపాణి, మహేందర్ రావు, ఆలయ ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్భల భాస్కర్‌శర్మ పాల్గొన్నారు.

## ఎయిమ్స్ వ్యవస్థాపక దినోత్సవం



మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, ఐసీఎంఆర్ అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంఘమిత్ర పాటి

బీబీనగర్, ఏప్రిల్ 9 : మండల పరిధిలోని బీబీనగర్ ఎయిమ్స్ రెండో వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను డైరెక్టర్ వికాస్ భాటియా ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. న్యూఢిల్లీలోని ఐసీఎంఆర్ అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంఘమిత్ర పాటి, ఐఈసీ చైర్ పర్సన్ ప్రొఫెసర్ డాక్టర్ సూర్యనారాయణ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు, నర్సింగ్ ఆఫీసర్లకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. అనంతరం అనుసంధాన్ మ్యాగజైన్, విద్యార్థులకు వెల్‌నెస్ యోగా బుక్‌లెట్‌ను రిలీజ్ చేశారు. కార్యక్రమంలో అకడమిక్స్ డీన్ డాక్టర్ రాహుల్ నారంగ్, రీసెర్చ్ డీన్ డాక్టర్ సంగీత సంపత్, ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ నితిన్ అశోక్ జాన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అభిషేక్ అరోరా, అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బిపిన్ వర్గీస్, ఎయిమ్స్ బీబీనగర్ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ జార్జ్ ఏ డిసౌజా పాల్గొన్నారు.

## మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన కరీం



మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌ను సన్మానిస్తున్న కరీం

రాజాపేట, ఏప్రిల్ 9 : తుర్క కాశ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఉబేదుల్ల కొత్వాల్‌ను హైదరాబాద్ హజ్ హౌస్‌లో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్కే కరీం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. అనంతరం కాశ కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పేద కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట జిల్లా, మండల నాయకులున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి : ఎంపీడీఓ



మంతపురిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్

ఆలేరురూరల్, ఏప్రిల్ 9 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్ అన్నారు. మండలంలోని మంతపురి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ అంచనా ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి అనురాధ, గ్రామ ప్రత్యేకాధికారి చైతన్య, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జీవ ఎరువులపై రైతులకు అవగాహన



రాజాపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థినులు

రాజాపేట, ఏప్రిల్ 9 : మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఫైనల్ ఇయర్ విద్యార్థినులు బుధవారం రైతులకు జీవ ఎరువులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రైకోడెర్మా వాడకం, వాటి ఉపయోగాలు, ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు కె. స్ఫూర్తి, జి. స్రవంతి, టి.నిషిత పాల్గొన్నారు.

## గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి



పటేల్‌గూడెంలో బోర్లను పరిశీలిస్తున్న తాసీల్దార్ అంజిరెడ్డి

ఆలేరురూరల్, ఏప్రిల్ 9 : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని తాసీల్దార్ అంజిరెడ్డి అన్నారు. మండలంలోని పటేల్ గూడెం గ్రామంలో బుధవారం పలు బోర్లను పరిశీలించి కిరాయికి తీసుకునేందుకు రైతులతో మాట్లాడారు. ఆయన వెంట ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, పంచాయతీ కార్యదర్శి శ్రీలత తదితరులున్నారు.

## ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 9 : మండలంలోని రాయిపల్లిలో నిరుపేద కుటుంబానికి చెందిన వడ్డెబోయిన సాయిలు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల హరిదీప్‌రెడ్డి అందించిన రూ.5వేలు, బీఆర్‌ఎస్ మండల సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేశ్‌గౌడ్ అందించిన రూ.2వేల నగదును బుధవారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు సాయిలు కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# కేంద్రాన్ని ప్రారంభించారు.. కొనుగోళ్లు ఆపేశారు!



ఆత్మకూరు(ఎం) : పల్లెర్ల ధాన్యం కొనుగోలు కేంద్రంలో రాశులు

మండలంలోని పల్లెర్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈనెల 5న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యాన్ని తీసుకొచ్చి నాలుగు రోజులు అవుతున్నా కొనుగోళ్లు జరుపడం లేదని, వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బు జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

- ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 9

## నేడు యాదగిరిగుట్టలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 9 : యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సురేంద్ర నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు 5 గంటల పాటు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## వారంలోపు 6 కేంద్రాలు ప్రారంభం : పరమేశ్వర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 9 : యాసంగి ధాన్యం కొనుగోలు చేయడానికి భువనగిరి పీఏసీఎస్ ఆధ్వర్యంలో వారంలోపు 6 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం పీఏసీఎస్ కార్యాలయంలో కేంద్రాల ఇన్‌చార్జిలు, హమాలి కాంట్రాక్టర్లతో ఆయన నిర్వహించి కొనుగోలుపై జిల్లా యంత్రాంగం చేసిన సూచనలు తెలియజేశారు. కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, కేంద్రాల్లో టార్పాలిన్లు, రైతులకు వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.వెంకట్‌రెడ్డి, ఏఈఓ వెంకట్రావు, సీఈఓ చారి, కేంద్రాల ఇన్‌చార్జీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి : రమణి

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 9 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర అందించాలని మండల ప్రత్యేకాధికారి రమణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మౌలిక వసతులు కల్పించాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఇండ్ల నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించి నిబంధనల మేరకు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాపర్తి భాస్కర్ గౌడ్, ఎంపీఓ మజీద్, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ కృష్ణమూర్తి, ఏపీఎం నీరజ, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మార్కెట్ కమిటీ ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 9 : మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన కొంగరి బుచ్చిరెడ్డి, బెల్దే వేణు, శ్రీరామ్ యాదగిరికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఫకీరు మల్లారెడ్డి బుధవారం అందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 'గొర్రెల కాపరుల సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి'

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 9 : ఈ నెల 13న పట్టణంలో జరిగే గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం 4వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరి పిలుపునిచ్చారు. పట్టణంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. సమావేశంలో సుక్కల సత్యం, ముక్కెర్ల సతీశ్ యాదవ్, ఆకుల శ్రీనివాస్, పసుల బాలయ్య, సోము రమేశ్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో సమస్యల్లేకుండా చర్యలు

- ఫిర్యాదుల కోసం 92814 23621 నంబర్‌కు కాల్ చేయండి
- జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత



కాల్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్న పౌర సరఫరాల అధికారి వనజాత

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 9 : యాసంగి 2024-25లో ధాన్యం సేకరణ సజావుగా జరిపేందుకు అధికార యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతుందని జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత అన్నారు. కలెక్టరేట్‌లోని పౌర సరఫరాల చాంబర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్‌ను డీఆర్‌డీఓ నాగిరెడ్డితో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో 372 కేంద్రాల్లో 25 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోళ్లు మొదలు పెట్టినట్లు చెప్పారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కాల్‌సెంటర్ ఏర్పాటు చేసి ప్రత్యేక నంబర్ 92814 23621ను పెట్టినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదుల కోసం కొనుగోలు కేంద్రాల ఏజెన్సీల ప్రతినిధులు, పౌర సరఫరాల సిబ్బంది, రవాణా కాంట్రాక్టర్ల నుంచి ఒక ప్రతినిధిని కేటాయించామన్నారు. ఎలాంటి సమస్యలున్నా ఈ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరికృష్ణ, సహాయ పౌర సరఫరాల అధికారి రోజా రాణి, జిల్లా సహకార అధికారి శ్రీధర్, జిల్లా వ్యవసాయ అధికారి నీలిమ, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు, అధికారులు తదితరులున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే వీరేశం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

రామన్నపేట, ఏప్రిల్ 9 : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి రైతులకు ఉచితంగా సుతిలి దారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకుబ్ నాయక్, ఏఓ ఏజాజ్ పాల్గొన్నారు.

మోత్కూరు : మండలంలోని సదర్శనాపురంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మోత్కూరు ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు ప్రారంభించారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



మోత్కూరు : దత్తప్పగూడెంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం కమలాకర్‌రెడ్డి



ఆత్మకూరు(ఎం) : కోరటికల్‌లో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం వెంకన్న

ఆలేరు రూరల్, ఏప్రిల్ 9 : ప్రభుత్వ పాఠశాలల్లో పైసా ఖర్చులేకుండా నాణ్యమైన విద్య అందుతుందని హెచ్‌ఎం ఆకుల వేణుగోపాల్ అన్నారు. మండలంలోని కొలనుపాక జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులతో బుధవారం బడిబాట కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో మాట్లాడారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని కోరటికల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దడిపల్లి వెంకన్న ఆధ్వర్యంలో కోరటికల్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి చదువు విలువను వివరించి, వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, వరప్రసాద్, శ్రీనివాసచారి, అనురాధ, వెంకటేశం పాల్గొన్నారు.

మోత్కూరు : మండలంలోని దత్తప్పగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఏరెడ్ల కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఆ గ్రామంలో బడి బాట నిర్వహించారు.

## సీసీ కెమెరాలతో చోరీలను అరికట్టవచ్చు : సీఐ సురేశ్‌కుమార్



స్వర్ణకార వీధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ సురేశ్‌కుమార్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 9 : సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో చోరీలను అరికట్టవచ్చని సీఐ సురేశ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని స్వర్ణకార వీధిలో వారు ఏర్పాటు చేయించిన సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించాచి మాట్లాడారు. వార్డులో గుర్తు తెలియని వ్యక్తులు సంచరించినా, ఎలాంటి ఆధారాలు లేని వ్యక్తులు బంగారు, వెండి ఆభరణాలను విక్రయించడానికి వచ్చినా వారిపై నిఘా పెట్టి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో స్వర్ణకారులు దేవేందర్‌చారి, శ్రీనివాస్, వెంకట్, యాదగిరి పాల్గొన్నారు.

## వంట గ్యాస్ ధరలు తగ్గించాలని నిరసన



యాదగిరిగుట్టలో గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలుపుతున్న మహిళా సమాఖ్య సభ్యులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 9 : పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ డిమాండ్ చేశారు. పట్టణంలోని గుండ్లపల్లి ప్రధాన రహదారిపై బుధవారం గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత క్రూడ్ ఆయిల్ ధరలు నిలకడగా ఉన్నప్పటికీ గ్యాస్ ధరలు పెంచి ప్రజల మీద భారం మోపుతుందని విమర్శించారు. గ్యాస్ ధర గతంలో రూ. 855 ఉంటే రూ.50 పెంచి ప్రజల నెత్తిపై అధిక భారం మోపారన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య మండల ప్రధాన కార్యదర్శి ఆరె పుష్ప, మహిళా నాయకులు ఉట్కూరి బాలమణి, గోద సువర్ణ, కొన్ని ముత్తమ్మ, గుండు మమత, కొన్ని మహేశ్వరి, మమత, లలిత, రాచకొండ భాగ్యమ్మ పాల్గొన్నారు.

మండలంలోని గౌరాయిపల్లిలో గ్యాస్ ధరలు తగ్గించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి, ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్‌తో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్, నాయకులు కొంగర సాయిరాం, గడ్డం యాదగిరి, కొంగరి ప్రమీల, శ్యామల, లక్ష్మి, గడ్డం శేఖర్ పాల్గొన్నారు.

మోటకొండూర్ : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేకుండా పోయిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్ కంపెనీలకు రూ.లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ పేదలపై భారం మోపుతుందని ఆరోపించారు.

## తల్లిదండ్రులను పోషించాలి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

బీబీనగర్, ఏప్రిల్ 9 : తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ పిల్లలు బాధ్యతాయుతంగా చూసుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో దాతల సహకారంతో నిర్మించిన వయోవృద్ధుల సంక్షేమ సంఘం భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆలయన ప్రారంభించి మాట్లాడారు. వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం అన్నిరకాలుగా కృషిచేస్తుందని, వివిధ పథకాల ద్వారా సుమారు 5 లక్షల ఇన్సూరెన్స్‌లో అందజేస్తుందన్నారు. వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు మాట్లాడుతూ బడ్జెట్‌లో శాఖను కేటాయించి నిధులు మంజూరు చేయాలన్నారు. భవనం చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో రూ.4 లక్షలతో పార్కును అభివృద్ధి చేయాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయకులు గోళి ప్రణితా పింగళ్‌రెడ్డి, యర్కల సుధాకర్ గౌడ్, గోలి నరేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, పాటోళ్ల శ్యామ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

## సన్న బియ్యం అన్నం తిన్న ఎమ్మెల్యే

బీబీనగర్ : మండలంలోని రావిపహాడ్ తండాలో తెల్లరేషన్ కార్డు లబ్ధిదారుడు బాణోతు కాంతిశంకర్‌నాయక్ ఇంట్లో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి రేషన్ సన్నబియ్యంతో వండిన అన్నాన్ని వారితో కలిసి తిన్నారు. కార్యక్రమంలో భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ హనుమంతరావు



రాజపేటలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

రాజాపేట, ఏప్రిల్ 9 : పెండింగ్‌లో రైతుల భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. రాజాపేట, తుర్కపల్లి, యాదగిరిగుట్ట మండలాల తాసీల్దార్ కార్యాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ధరణిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, తప్పుడు రిపోర్ట్ పంపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే కోసం వచ్చిన అప్లికేషన్లను పూర్తిచేయాలని, మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా క్లియర్ చేసి ప్రజలకు అందించాలని ఆదేశించారు. రేషన్ కార్డు దరఖాస్తులను సర్వే నిర్వహించి లబ్ధిదారులకు అందే విధంగా చూడాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి లబ్ధి దారులకు అందించాలని సూచించారు. రాజీవ్ యువ వికాస పథకానికి గడువు ఈ నెల 14 వరకు ఉందని, దీని గురించి యువతకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ అనిత, ఎంపీడీఓ నాగవేణి, డీటీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్ఐలు నర్సింలు, రమేశ్ ఉన్నారు.

# నార్మూల్ చైర్మన్‌పై అమీతుమీ!

- గుట్టలో ఎమ్మెల్యేలతో డైరెక్టర్ల భేటీ
- వద్దంటే వద్దని 12 మంది పట్టు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 9 : నార్మూల్ మదర్‌డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డిపై అమీతుమీ తేల్చుకునేందుకు కాంగ్రెస్‌తో పాటు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు సిద్ధమయ్యారు. ఆయనతో పాడి రైతుల్లో వ్యతిరేకతతో పాటు, నార్మూల్ సంస్థ మూసివేసే పరిస్థితికి వచ్చిందని డైరెక్టర్లు అందరు కలిసి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో విన్నవించుకున్నట్లు సమాచారం. మిగతావారిలో ఎవరినైనా చైర్మన్‌గా ఎన్నుకోండి కానీ మధుసూదన్‌రెడ్డి వద్దని వారి నిర్ణయాన్ని ఎమ్మెల్యే ముందు ఉంచినట్లు తెలుస్తున్నది. యాదగిరిగుట్టలోని ఆయన నివాసంలో బుధవారం ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో ఆలేరు నియోజవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నార్మూల్ డైరెక్టర్లు కలిసి సంస్థ చైర్మన్‌గా మధుసూదన్ రెడ్డి విధుల్లో చేరి 6 నెలల్లో చేసిన నిర్వాహకంపై పూసగుచ్చినట్లు వివరించారని సమాచారం. 6 నెలల కాలంలో రైతులకు ఇవ్వాల్సిన 5 బిల్లులు పెండింగ్ ఉన్నాయని, మరో 5 రోజులు దాటితే ఇంకో బిల్లు పెరిగి పాడిరైతుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చే పరిస్థితి ఉందని, 6 బిల్లుల్లో డబ్బు సుమారు రూ. 20 కోట్ల వరకు ఉంటుందని చెప్పినట్లు తెలిసింది. ఇప్పటికిప్పుడు పాడిరైతులకు బిల్లులిస్తేనే బాగని, లేకుంటే రైతులు రోడెక్కే పరిస్థితి ఉందని వివరించినట్లు సమాచారం. దీనిపై యుద్ధ ప్రాదిపతికన నిర్ణయం తీసుకోవాలని, పరిస్థితి చేయి దాటి పోయే ప్రమాదం ఉందని, ప్రస్తుత చైర్మన్ పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం కూడా చేయకపోతుండడంతో పక్కన పెట్టడమే సరైన నిర్ణయమని చెప్పుకొచ్చిన్నట్లు సమాచారం. చైర్మన్‌గా వేరే వ్యక్తిని నియమిస్తే అనుకూలంగా ఓటేసేందుకు సిద్ధమేనన్న తుది నిర్ణయం ప్రభుత్వ విప్‌కు తెలియజేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.


### 12 మంది డైరెక్టర్లలో వ్యతిరేకత..

గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన నార్మూల్ డెయిరీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డైరెక్టర్ల ఆధిక్యం ఉండటంతో తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన గుడిపాటి మధుసూదన్‌రెడ్డిని చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాలకవర్గంలో చైర్మన్‌తో కలిపి మొత్తం 15 మంది ఉంటే, ఇందులో బీఆర్‌ఎస్‌కు చెందిన వారు ఆరుగురు ఉన్నారు. ఇందులో ప్రధానంగా ఒకరిద్దరు మినహా మొత్తం 12 మంది డైరెక్టర్లు చైర్మన్ తీరును తప్పుబడుతున్నారని తెలిసింది. జల్సాలకు పాల్పడి, ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారని చెప్పుకుంటున్నారు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద పాలు కొనుగోలు చేసి కమీషన్లను జేబులో వేసుకుంటున్నారనే ఆరోపణలను ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లారని సమాచారం.

### నేడో రేపో తేలనున్న పంచాయితి

చైర్మన్ పదవి నుంచి గుడిపాటి మధుసూదన్‌రెడ్డిని దాదాపుగా పక్కన పెట్టే యోచనలో మంత్రులు, ఎమ్మెల్యే ఉన్నట్లుగా సమాచారం. మెజారిటీ డైరక్టర్లు, పాల సంఘం చైర్మన్లు ఆయన తీరుపై వ్యతిరేకంగా ఉన్నారనే ఆలోచనలో పడ్డారని తెలుస్తున్నది. ఆయన కొనసాగింపుపై నేడోరేపో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. కాగా కాంగ్రెస్ పార్టీకి చెందిన 9 మంది డైరెక్టర్లు మధుసూదన్‌రెడ్డే చైర్మన్‌గా కొనసాగుతారని మీడియాకు బుధవారం రాత్రి వెల్లడించడం గమనార్హం.

## దేశవ్యాప్త సమ్మెను జయపద్రం చేయాలి : సీఐటీయూ



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 9 : దేశంలో ఉద్యోగ, కార్మికులను బానిసత్వంలోకి నెట్టే నాలుగు లేబర్ కోడ్ల రద్దును కోరుతూ మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని దుంపల మల్లారెడ్డి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏండ్లుగా పోరాడి సాధించుకున్న కనీస వేతనాల చట్టం, ఉద్యోగ భద్రతా చట్టం, 8 గంటల పని విధానం, సంఘం పెట్టుకునే హక్కు, సంఘటితంగా పోరాడే హక్కు, సమ్మె హక్కు, తదితర అనేక చట్టాలన్ని లేబర్ కోడ్లతో ఆవిరైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బడా పెట్టుబడిదారులకు, యాజమానులకు అనుకూలంగా తెచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను వెనక్కి తీసుకునేదాక కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్‌కు కట్టబెట్టాలని చూస్తుందని, ఇప్పటికే 16 లక్షల 35వేల కోట్లు ఎన్‌పీఏ పేరుతో మాఫీ చేసిందన్నారు. నిత్యవసరాల ధరలు అకాశాన్ని అంటాయని, ప్రజల ఆదాయం మాత్రం పెరుగడంలేదన్నారు. ప్రైవేటీకరణ విధానాలను వెనక్కి తీసుకోవాలని 11 జాతీయ కార్మిక సంఘాలు మే 20న సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని మే 20న జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.పాష, గొరిగె సోములు, సహాయ కార్యదర్శులు మాయ కృష్ణ, సత్యనారాయణ, సిలివేరు రమాకుమారి, గడ్డం ఈశ్వర్ పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో ఇబ్బందుల్లో ప్రజలు : సీపీఎం

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 9 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలు తీర్చకుండా ప్రజలపై అధిక ధరలు మోపి ఇబ్బందులకు గురి చేస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ అన్నారు. దివంగత శాసనసభా పక్షనేత నర్రా రాఘవరెడ్డి పదో వర్ధంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజల సమస్యలు తీర్చడంలో విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, కోమటిరెడ్డి, చంద్రారెడ్డి, మాయ కృష్ణ, గడ్డం వెంకటేశ్, వడ్డెబోయిన వెంకటేశ్ పాల్గొన్నారు.